
# దేవత



ఆంధ్రభూమి వీక్లీ 1 జనవరి, 2004

"రేఖా! నిన్న సాయంత్రం మీ ఇంటికొస్తే తాళం వేసివుంది. ఎక్కడికెళ్లారు?" అని అడిగింది లక్ష్మి.

"సినిమాకెళ్లాం. ఏదైనా పనిమీద వచ్చారా?"

"లేదు... ఊరికే ప్రొద్దుపోకుంటే వచ్చాను."

లక్ష్మి, రేఖ ఇరుగుపొరుగు వాళ్ళు. రేఖ తండ్రికి ఆ ఊరికి ట్రాన్స్‌ఫర్ అవడంతో రెండునెలల క్రితమే ఆ వీధిలోని ఓ ఇంటిలో దిగారు.

రేఖకు లక్ష్మితో ఈమధ్యే పరిచయం అయింది.

లక్ష్మి అవసరానికంటే ఎక్కువే మాట్లాడుతుందని అర్థమైంది రేఖకు.

"అదిగో... ఆడంగి వస్తున్నాడు!" అంది లక్ష్మి దూరంగా మోటార్‌బైక్ పైన వస్తున్న వేణుని చూపిస్తూ.

"ఆయన వసుధ భర్త... వేణుగారు కదూ? ఎందుకు ఆయనకు ఆ పేరు పెట్టారు?" అంది రేఖ ఆశ్చర్యంగా.

"ఆడంగి పనులు చేసేవాణ్ణి 'ఆడంగి' అనక ఇంకేమంటారు?"

"ఛ...ఛ..! ఆయన అందంగా, హీరోలా ఉంటారు. మంచి ఉద్యోగంలో ఉన్నారు. ముఖ్యంగా ఇద్దరు అందమైన పిల్లలకు తండ్రి. ఎంతో డీసెంట్‌గా కనిపిస్తారు. మర్యాదగా మాట్లాడతాడు" అంది రేఖ.

"అవన్నీవుంటే ఏం లాభం? మా ఎదురిల్లే కనుక ఉదయం లేచిన దగ్గర్నుంచీ ఆయన చేసేవన్నీ నాకు కనిపిస్తూ ఉంటాయి. కూరగాయలు తరిగివ్వడం, క్యారియర్‌లు సర్దడం, నీళ్లు పట్టడం... ఒకటేమిటి- వసుధ చెప్పిన పనల్లా తు.చ. తప్పకుండా చేస్తూంటాడు. వసుధకు వంట చేయడం తప్ప మరో పని లేదు!" అంది లక్ష్మి.

"అబ్బ! మీరు చెప్పేది వింటూంటే ఎంతో ముచ్చట వేస్తోంది. మగవాళ్ళు భార్యల కష్టాల్ని అర్థంచేసుకోవడం, వారికి సహాయపడటం గొప్ప విషయం! అటువంటి భర్త ఉన్న వసుధ ఎంతో అదృష్టవంతురాలు!"

"సహాయం చెయ్యాలి... కాదనను. మరీ అంతలా చెయ్యవలసిన అవసరం లేదంటాను నేను. మగవాడన్నాక ఓ హోదా, గౌరవం, ఇగో... ఇవన్నీ ఉండాలి. లేకుంటే ఆడదానికీ, మగవాడికీ తేడా ఏముంటుంది?" అంది లక్ష్మి.

"భలేవారే! ఆ తేడాలు ఉండకూడదని ఆడవాళ్ళంతా పోరాడుతూంటే మీరు తేడాలు ఉండాలంటారేం..?" అంది రేఖ.

"నేను మీతో వాదించి మిమ్మల్ని ఒప్పించలేను గాని, వేణు మాత్రం 'ఆడంగి' పనులే చేస్తున్నాడు. అతనికి ఆ పేరు పెట్టగానే మన వీధిలో వాళ్ళు సరైన పేరు పెట్టావని నన్ను సమర్థించారు కూడా!"

"నాకు మాత్రం వేణుగారంటే మంచి గౌరవం ఉండేది. మీరు ఆయన గురించి చెప్పాక ఆ గౌరవం మరింత పెరిగింది!" అంది రేఖ.

• • •

మరుసటి రోజు సాయంత్రం రేఖ- వసుధ ఇంటికి వెళ్లింది.

రేఖను సాదరంగా ఆహ్వానించింది వసుధ.

ఇద్దరూ కాసేపు మాట్లాడుకుంటూ కూర్చున్నారు.

వారి మాటల్లో లక్ష్మి ప్రస్తావన వచ్చింది.

"నేను విన్నాను. ఆవిడ నన్ను ఏదైనా అన్నా బాధపడేదాన్ని కాను. కాని, నాకు ఎంతో సహాయం చేస్తున్న ఆయనకు పేర్లు పెట్టడం నన్నెంతో బాధించింది!" అంది వసుధ.

"మీరు బాధపడకండి. కొంతమందికి తమకు లేనివి ఎదుటిమనిషికి ఉంటే ఈర్ష్య కలుగుతుంది. ఆ ఈర్ష్య వల్ల అలా ప్రవర్తిస్తారు, పేర్లు పెడతారు. లక్ష్మి భర్త ఆమెకు ఇంటిపనుల్లో

ఏమాత్రం సహాయం చేయరు. పైగా... అతనికి క్యాంపులుండే మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగం. వేణులాంటి భర్త ఉన్నందుకు మీరు గర్వపడాలి."

"నిజమే! ఆయన సహకారమే లేకుంటే నేనసలు ఈ ఉద్యోగమే చేసేదాన్ని కాను. నిజానికి నాకు ఉద్యోగం చేసే అవసరం లేకున్నా ఇంట్లో ఉంటే ఇరుగుపొరుగు వారితో మాటలు, గాసిప్స్ తప్పవని, దానివల్ల విలువైన సమయంతో పాటు మనసు కూడా పాడవుతుందని, మనిషి బిజీగా ఉంటే అనవసరపు ఆలోచనలు ఉండవని ఆయన నన్నీ ఉద్యోగంలో చేర్పించారు."

"వేణుగారు చెప్పింది అక్షరాలా నిజం!" అంది రేఖ.

"అయినా... మేము ఎవరి జోలికీ వెళ్లడం లేదు. ఎవరి గురించీ చెడుగా చెప్పడం లేదు. ఇంటికి వచ్చినవాళ్ళతో మర్యాదగానే ప్రవర్తిస్తూ ఉంటాము. ఎవరైనా తమ ఇంటికి రమ్మని ఆహ్వానిస్తే వెళ్లివస్తుంటాము. అయినా కొంతమంది మా గురించి అలా మాట్లాడుకోవడం, పేర్లు పెట్టడం చూస్తూంటే నాకు చాలా బాధ కలుగుతోంది!" అంది వసుధ కళ్ళనీళ్లతో.

"ఎవరి సంస్కారం వాళ్ళది. మీరు అవన్నీ పట్టించుకోకండి. డోంట్ వర్రీ... బీ హ్యాపీ!" అంది రేఖ సముదాయింపుగా.

రేఖ వెళ్లిపోయాక వసుధ మనసంతా చిరాకుతో, బాధతో నిండిపోయింది.

మరుసటి రోజు నుంచి భర్త సహాయం లేకుండానే తన పనులు చేసుకోవాలన్న నిర్ణయానికి వచ్చింది.

ఆరోజు ఉదయం నాలుగు గంటలకే లేచి పనుల్లో పడింది. మామూలుగా ఆరు గంటలకు భర్తను నిద్ర లేపేది. ఆరోజు కావాలనే అతన్ని లేపలేదు.

ఆరున్నరకు నిద్ర లేచిన వేణు- టైం చూసి ఆశ్చర్యపోతూ, "నన్ను నిద్ర లేపలేదేం వసూ..?" అని భార్యని అడిగాడు.

"మీరు కాసేపు పడుకోండి... నేను చేసుకుంటాను."

తను ఆలస్యంగా లేచినందుకు భార్యకు కోపం వచ్చిందని భావించి, "సారీ వసూ... కోపమొచ్చిందా?" అని అడిగాడు వంటింట్లోకి వస్తూ.

"వద్దండీ... ప్లీజ్! మన వీధిలోనివాళ్ళంతా మీకు పేర్లు పెట్టడం నేను సహించలేక పోతున్నాను. అందుకే ఈరోజు నుంచి నా పనులు నేనే చేసుకోవాలనుకుంటున్నాను. దయచేసి మీరు వంటగది లోకి రాకండి!" అంది అర్థింపుగా.

వేణుకి ఆమె బాధ అర్థమైంది.

ఆ సమయంలో ఆమె తను ఏం చెప్పినా వినదని అతనికి తెలుసు. అందుకే మౌనంగా హాల్లోకెళ్ళి న్యూస్‌పేపరు చేతిలోకి తీసుకున్నాడు.

అయితే ఆమె పడే అవస్థలన్నీ అతనికి తెలుస్తూనే ఉన్నాయి...

పిల్లల్ని రెడీ చేసి, అన్నం వడ్డించి, క్యారియర్లు సర్ది, వాళ్ళను స్కూలుకు పంపించేసరికి ఆమెకు ఆఫీసుకి వెళ్లే టైమయింది. గబగబా తానూ రెడీ అయి, స్కూటీపై ఆఫీసుకి వెళ్లిపోయింది.

సమయం లేకపోవడం వల్ల ఆమె టిఫిన్ తినలేదని, మధ్యాహ్నానికి క్యారియర్ కూడా తీసుకెళ్లలేదని అతనికి అర్థమైంది. తన క్యారియరు మాత్రం ఆమె సిద్ధంచేసి ఉంచడం చూసి నవ్వొచ్చింది అతనికి.

మధ్యాహ్నం ఒంటిగంటకు వసుధ వద్దకు అటెండరు వచ్చి, "మేడమ్! మీ సారు ఇప్పుడే వచ్చివెళ్లారు. మీరు మేడపై ఉన్నారని చెబితే ఈ ఉత్తరం మీకివ్వమని చెప్పారు!" అంటూ ఓ కాగితాన్ని ఇచ్చాడు.

తీసి చదివింది...

"క్యారియర్ మీ స్టాఫ్ రూమ్‌లో పెట్టొచ్చాను వసూ! మనం మనకోసం బ్రతకాలి. మనవారి కోసం బ్రతకాలి. ఎవరో, ఏదో అన్నారని మన ఆనందాన్నీ, ఆరోగ్యాన్నీ పాడుచేసుకోవడం మంచిది కాదు."

ఉత్తరం చదివాక ఎంతో గిల్టీగా ఫీలయింది వసుధ. 'ఛ అనవసరంగా తను ఇబ్బంది పడి, ఆయన్నీ ఇబ్బంది పెట్టింది. ఆయన అన్నట్లు తను తనకోసం బ్రతకాలి. తనవాళ్ళ కోసం బ్రతకాలి!' అనుకుంది.

స్టాఫ్‌రూమ్‌లో క్యారియర్ చూడగానే భర్తకు తనపై ఉన్న ప్రేమకు, ఆప్యాయతకు ఆమె కళ్ళలో నీళ్లు తిరిగాయి. 'మావారు బంగారు కొండా..!' అని మనసులో పాడుకుంటూ క్యారియర్ విప్పసాగింది.

• • •

**ఆ**రోజు రెండవ శనివారం కావడంతో- ఇంట్లో పిల్లలతో గడిపారు వసుధ, వేణు.

సాయంత్రం సినిమాకు వెళ్లాలని అనుకున్నారు.

పిల్లలతో బయటకు వచ్చిన వసుధ- లక్ష్మి వాళ్ళ ఇంటిముందు ఆందోళనగా నిలబడి వుండటం చూసి, "ఏమిటి అలా ఉన్నారు?" అని అడిగింది.

"పిల్లల కోసం చూస్తున్నాను. సిటీలో గొడవలట... మధ్యాహ్నం రెండుగంటల నించీ కర్ఫ్యూ విధించారట! 'పిల్లలు ఎలా ఇంటికి వస్తారా...' అని భయపడుతున్నాను. ఆయన ఊర్లో లేరు... కర్నూలు వెళ్లారు... రాత్రికి వస్తానని చెప్పారు!" అంది లక్ష్మి.

విషయం విన్న వేణు- మోటార్‌బైక్ బయటకు తీసి, "మీ పిల్లలు ఏ స్కూల్లో చదువు తున్నారు?" అని అడిగాడు లక్ష్మిని.

ఆమె స్కూలు పేరు, అడ్రసు చెప్పి, "పిల్లలు స్కూల్లో లేరు. అరగంట క్రితమే బస్సులో బయలుదేరారట... నేను స్కూలుకి ఫోన్ చేస్తే చెప్పారు!" అంది.

"నేను ఆ రూట్‌లో చూసుకుంటూ వెళ్తాను. ఎక్కడో ఒకచోట బస్సు కనిపించవచ్చు!" అన్నాడు వేణు.

"మీరు మాత్రం ఎలా వెళ్తారు? చాదర్‌ఘాట్ వరకూ కర్ఫ్యూ ఉందట. మీరు రిస్క్ తీసుకోకండి!" అంది లక్ష్మి.

ఇంతలో... ఆమె ఇంట్లో ఫోన్ మోగడంతో- లోపలికి పరిగెత్తింది. ఫోనులో మాట్లాడాక బయటకు వచ్చి, "బస్సు డ్రైవరు అబిడ్స్‌లో బస్సు ఆపేశాడట. పిల్లలు జి.పి.ఓ. దగ్గర్లోని ఎస్టీడి బూత్ నుంచి ఫోన్ చేశారు. చాలా భయపడుతున్నారు వాళ్ళు!" అంది.

వేణు వెంటనే బైక్ స్టార్ట్‌చేసి వెళ్లిపోయాడు. గంటసేపు గడచినా వేణుగాని, పిల్లలుగాని రాలేదు. పిల్లల గురించి లక్ష్మి, భర్త గురించి వసుధ ఆందోళన చెందసాగారు. విషయం తెలిసి ఇరుగుపొరుగున ఉన్న ఆడవాళ్ళు లక్ష్మికి ధైర్యం చెప్పసాగారు.

"సమయానికి మన వీధిలో కరెంటు లేదు. లేకుంటే టీ.వీ. ద్వారా కర్ఫ్యూ విషయం మనకూ తెలిసేది. కాస్త ముందుజాగ్రత్త పడేవాళ్ళం!" అంది ఒకావిడ.

"ఎవరో కొందరు ఉన్మాదంతో చేసే చర్యలు ఎంతమందికి ఆందోళన కలిగిస్తున్నాయో చూడండి! భర్త ఇంటికి రాలేదని భార్య, పిల్లలు రాలేదని తల్లిదండ్రులు, భార్య ఎలావుందో అని భర్త... ఇలా ఇంతమందికి అసౌకర్యాల్ని కలిగించే మతాభిమానం అవసరమా?" అంది రేఖ.

ఇంతలో... పిల్లలతో వస్తున్న వేణు కనపడ్డాడు. అతన్ని చూస్తూంటే 'ఆడంగి'లా కనిపించలేదు ఆ వీధి ఆడవాళ్ళకు. ఓ హీరోలా కనిపించాడు.

పిల్లల్ని దగ్గరకు తీసుకుని, "చాలా థాంక్సండీ... చాలా రిస్కు తీసుకున్నారు మీరు!" అంది లక్ష్మి కృతజ్ఞతగా.

"మరేం పర్వాలేదు. పోలీసు డిపార్ట్‌మెంటులో నాకు స్నేహితులు ఉన్నారు. వారి సహాయంతో పిల్లల్ని తీసుకురాగలిగాను" అన్నాడు వేణు.

తర్వాత ఇంట్లోకి పోబోతున్న లక్ష్మితో- "మీవారిని కాంటాక్ట్ చేసి ఈరాత్రి రావద్దని చెప్పండి. ఉదయం సిటీలో పరిస్థితి తెలుసుకొని బయలుదేరమని చెప్పండి!" అన్నాడు.

ఆమెకి ఎంతో ఆశ్చర్యం వేసింది. ఆ విషయం తను కూడా ఇంత త్వరగా ఆలోచించలేదు. మంచితనం ఉన్న వ్యక్తి తనవాళ్ళ గురించే కాదు, తనకు తెలిసిన ప్రతి ఒక్కరి గురించి ఆలోచిస్తాడనీ, అందరి క్షేమం కోరతాడనీ ఆమెకు అర్థమైంది.

తరువాత రేఖను కలిసినప్పుడు వేణు గురించి గొప్పగా చెప్పింది లక్ష్మి.

"లక్ష్మిగారూ! నేను ఆరోజే చెప్పాను... వారి మంచితనం గురించి! ఎదుటిమనిషి గురించి చెడుగా మాట్లాడటానికి, పేరు పెట్టడానికి పెద్దగా తెలివితేటలు అక్కర్లేదు. కాని, వాళ్ళ మంచిని గుర్తించడానికి మాత్రం ఎంతో సహనం, అవగాహన కావాలి. దయచేసి మీరు పాజిటివ్‌గా ఆలోచించడం అలవాటు చేసుకోండి. దీనివల్ల ఎంతమంది మీకు దగ్గరౌతారో మీరే చూడండి!" అంది రేఖ.

"తప్పకుండా! చిన్నదానివైనా చక్కగా చెప్పావు. నీ సలహా పాటిస్తాను" అంది లక్ష్మి.

పాఠకుల కోసం, సాహితీప్రియుల కోసం

**జయంతి పబ్లికేషన్స్**

ప్రచురించిన పుస్తకాల గురించి క్లుప్తంగా వివరిస్తూ రూపొందించిన
పూర్తి కేటలాగ్ కోసం చివరిపేజీల్లో చూడండి.